తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 33 | గురువారం 29.10. 2026 | పేజీలు :4 | వెల: 2

పత్తి కొనుగోళ్లలో ప్రైవేట్ వ్యాపారుల పంజా!

- లైసెన్సులు లేకుండానే కొనుగోళ్లు.. మద్దతు ధరకు తూట్లు
- సుజాతనగర్‌లో పుట్టగొడుగుల్లా కేంద్రాలు..
  తేమ, తూకం పేరుతో కోతలు?
- మార్కెట్ ఫీజుకు ఎగనామం..
  లారీల్లో పక్క రాష్ట్రాలకు పత్తి తరలింపు
- అధికారుల పర్యవేక్షణ కరువు..
  దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



సుజాతనగర్ అక్టోబర్ 28 (సూర్యోదయ వార్త)

పంట పండించడం ఒక ఎత్తయితే.. దాన్ని గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం మరో ఎత్తుగా మారింది. ఆరుగాలం శ్రమించి పత్తి పండించిన రైతుకు మార్కెట్‌లో అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో జాప్యం, తక్షణ నగదు అవసరాలు, పంట సాగు సమయంలో ప్రైవేట్ వ్యాపారుల నుంచి తీసుకున్న అప్పులు.. ఇవన్నీ రైతులను ప్రైవేట్ కొనుగోలుదారుల వైపు నెట్టుతున్నాయి. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు లైసెన్సులు, మార్కెట్ ఫీజుల నిబంధనలను పట్టించుకోకుండా కొనుగోళ్లు సాగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పల్లెల్లో వ్యాపారులదే పైచేయి!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలో పత్తి కొనుగోలు కేంద్రాలు పెరిగిపోతున్నాయి. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తి సేకరిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ కేంద్రాలకు సంబంధిత మార్కెట్ కమిటీ అనుమతులు ఉన్నాయా? వ్యాపారులు చెల్లించాల్సిన మార్కెట్ ఫీజులు చెల్లిస్తున్నారా? కొనుగోళ్లు నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారిక అనుమతులు లేకుండానే కొందరు వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అనుమతులు, లావాదేవీల రికార్డులు, మార్కెట్ ఫీజుల చెల్లింపులను పరిశీలిస్తేనే వాస్తవ పరిస్థితి వెల్లడయ్యే అవకాశం ఉంది.

అప్పు ఉచ్చు.. ధర నిర్ణయించేది వ్యాపారే!

విత్తనాలు వేసే సమయం నుంచి రైతులకు పెట్టుబడి అవసరాలు మొదలవుతాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం కొందరు రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అవసరమైన సామగ్రిని అప్పుగా తీసుకుంటున్నారు. పంట చేతికి వచ్చిన తర్వాత అప్పుతోపాటు వడ్డీ చెల్లించాల్సి రావడంతో పత్తిని అదే వ్యాపారికి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు.

దీంతో పత్తికి ధర నిర్ణయించే విషయంలో రైతుల బేరసారాల శక్తి తగ్గిపోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యాపారులు చెప్పిన ధరకు పత్తిని అమ్ముకోవాల్సి వస్తోందని, తేమ శాతం పేరుతో ధర తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. హమాలీ ఖర్చుల పేరుతో అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులూ వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపితేనే రైతులకు జరుగుతున్న నష్టం ఎంతన్నది స్పష్టమవుతుంది.

మద్దతు ధరకు.. ప్రైవేట్ ధరకు భారీ వ్యత్యాసం!

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు రైతులు వెళ్లినప్పుడు సమయం ఎక్కువగా పడటం, కొనుగోలు ప్రక్రియలో జాప్యం, నగదు జమ కావడంలో ఆలస్యం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. అత్యవసర ఖర్చుల కోసం డబ్బు అవసరమైన రైతులు వెంటనే నగదు అందించే ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు.

సీసీఐ మద్దతు ధరతో పోలిస్తే ప్రైవేట్ వ్యాపారులు చెల్లించే ధరలో క్వింటాల్‌కు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు వ్యత్యాసం ఉంటోందని రైతులు చెబుతున్నారు. ఈ వ్యత్యాసం కారణంగా రైతులు గణనీయంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అయితే పత్తి నాణ్యత, తేమ శాతం, కొనుగోలు తేదీని బట్టి ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున, వాస్తవ ధరల వివరాలను అధికారికంగా పరిశీలించాల్సి ఉంది.

మార్కెట్ ఫీజులు ఎవరి జేబులోకి?

కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, సుజాతనగర్ మండలాలతోపాటు చంద్రుగొండ సబ్ మార్కెట్ యార్డు ఉన్నాయి. ఈ పరిధిలో పత్తి కొనుగోళ్లు నిర్వహిస్తున్న వ్యాపారులు తప్పనిసరిగా సంబంధిత నిబంధనలు పాటిస్తున్నారా? మార్కెట్ ఫీజులు చెల్లిస్తున్నారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

కొనగోలు చేసిన పత్తిని లారీల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారనే సమాచారం నేపథ్యంలో రవాణా పత్రాలు, కొనుగోలు రికార్డులు, మార్కెట్ ఫీజుల చెల్లింపులను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. స్థానిక జిన్నింగ్ మిల్లుల్లో రైతుల పేర్లతో పత్తి విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపైనా విచారణ జరగాలనే డిమాండ్ వినిపిస్తోంది.

తూకం నుంచి తరలింపు వరకు తనిఖీలు ఏవీ?

రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసే సమయంలో తూకం సక్రమంగా వేస్తున్నారా? తేమ శాతాన్ని శాస్త్రీయంగా నిర్ధారిస్తున్నారా? హమాలీ, ఇతర ఖర్చుల పేరుతో అనధికారిక వసూళ్లు జరుగుతున్నాయా? కొనుగోలు చేసిన పత్తికి సరైన రశీదులు ఇస్తున్నారా? అనే అంశాలను అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. వ్యాపారులు పత్తిని కొనుగోలు చేసి తరలిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల పర్యవేక్షణ కనిపించడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. అయితే అధికారుల తనిఖీలు, వ్యాపారుల లైసెన్సుల వివరాలు, మార్కెట్ ఫీజుల రికార్డులు బహిర్గతమైతేనే ఈ ఆరోపణల్లో వాస్తవాలు తేలనున్నాయి.

అన్నదాతకు అండగా నిలవాలి!

పత్తి కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ శాఖ, తూనికలు--కొలతల శాఖ అధికారులు సమన్వయంతో తనిఖీలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అనుమతులు లేని కొనుగోలు కేంద్రాలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, తూకం, తేమ నిర్ధారణ, ధర చెల్లింపుల్లో పారదర్శకత ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీసీఐ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హత కలిగిన రైతుల నుంచి నిబంధనల ప్రకారం పత్తి కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అప్పుల ఒత్తిడితో పంటను తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పత్తి పండించిన రైతుకు గిట్టుబాటు ధర అందాలి.. వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి.. మార్కెట్ వ్యవస్థపై రైతులకు నమ్మకం కలగాలి. సుజాతనగర్ పత్తి కొనుగోళ్లపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, ఆరోపణలపై నిజానిజాలు వెల్లడించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

బ్యాలెట్‌తోనూ ఓడిపోయారు

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ సెటైర్



హైదరాబాద్ సూర్యోదయ వార్త

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలుకావడంపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ ఎన్ని ఎమ్మెల్సీ స్థానాల్లో గెలిచిందో ఊహించాలంటూ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ప్రధాని పోస్టు చేశారు. యూపీ, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక బిహార్ వంటి నాలుగు పెద్ద రాష్ట్రాల్లో 28 శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరిగాయని మోదీ రాసుకొచ్చారు. అవన్నీ కూడా ప్రతిపక్షాలు కోరుకుంటున్నట్లు బ్యాలెట్ పద్ధతిలోనే జరిగాయని గుర్తుచేశారు.

రాజధానిలో తాగునీటి సమస్య రాకూడదు

- క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు వంద శాతం పని చేయాలి
- భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీరు వినియోగించాలి
- తాగు నీరు సరఫరా, ఎస్టీపీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ సూర్యోదయ వార్త

రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. రిజర్వాయర్లలో - మిగతా 2 లో..

ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ రోజులా?: కేటీఆర్



హైదరాబాద్: బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్ట్‌లపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా అడ్డుకున్నారని.. కాంగ్రెస్ కుట్రలను సహించే ప్రసక్తే లేదంటూ ఆయన ట్వీట్ చేశారు. ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ రోజులా? అంటూ ప్రశ్నించిన కేటీఆర్.. మూసీలో లక్షన్నర కోట్ల లూటీని ఆపాలంటూ డిమాండ్ చేశారు. రోడ్డున పడ్డ రైతుల కుటుంబాలను ఆదుకోవాలి.. లేదంటే రేవంత్‌కు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. "ఓ వైపు రాష్ట్రంలో కాంగ్రెస్ తెచ్చిన కరువు విలయ తాండవం చేస్తుంటే.. లక్షన్నర కోట్ల లూటిఫికేషన్ కు సీఎం రేవంత్ స్కెచ్ వేయడం సిగ్గుచేటు. లక్షలాది మంది రైతులు కరువులో నిండా మునిగి కన్నీళ్లు పెడుతుంటే సీఎం మాత్రం మూసీలో మూటల వేట సాగిస్తున్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు కనీసం 50 వేల పరిహారం ఇవ్వాల్సిన రేవంత్ పూర్తిగా చేతులెత్తేసి అన్నదాతలకు వెన్నుపోటు పొడిచారు" అంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. మూసీలో దోపిడీయే తన తొలి ప్రాధాన్యమని చాటిచెబుతున్న సీఎం రేవంత్ తీరు చూసి ఇవాళ 70 లక్షల మంది రైతులు అసహ్యించుకుంటున్నారు. మూసీ లూటిఫికేషన్ ముసుగులో లక్షల కుటుంబాల ఇళ్లు కూల్చి, రియల్ ఎస్టేట్ దందా చేయాలనే రేవంత్ పన్నాగాన్ని అడ్డుకునే వరకూ బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది. అప్రజాస్వామికంగా హౌస్ అరెస్ట్ చేసిన సబితా ఇంద్రారెడ్డి గారిని, కార్తీక్ రెడ్డిని ప్రభుత్వం వెంటనే బేషరతుగా విడుదల చేయాలని బీ ఆర్ ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. అలాగే మూసీలో లక్షన్నర కోట్ల లూటీని ఆపి, రోడ్డున పడ్డ రైతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఎల్‌నినో నష్ట పరిహారంగా రైతులకు ఎకరానికి రూ. 15,000 చెల్లించాలి

బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్ సూర్యోదయ వార్త

రాష్ట్రంలో ఎలినో ప్రభావం, తీవ్రమవుతున్న కరువు పరిస్థితులు రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బిజెపి శాసనసభా పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద విలేకరుల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన అంశాలు లేవనెత్తి మాట్లాడుతూ.. ఎలినో ప్రభావం ఉండవచ్చని కేంద్ర ప్రభుత్వం ఆరు నెలల ముందే స్పష్టం చేసినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదు. కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం రూ.7,000 కోట్లు, గుజరాత్ ప్రభుత్వం హెక్టారుకు రూ.8,500 సహాయం అందిస్తుంటే, తెలంగాణలో మాత్రం పంటలు వేయవద్దని చెప్పడం తప్ప రైతులను ఏ విధంగా ఆదుకుంటారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. ఎలినో ప్రభావంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వం చేతులు దులుపుకుండే తప్ప, రైతులను ఆదుకునే స్పష్టమైన చర్యలను వెల్లడించలేదు. కరువు మండలాలను ఏ ప్రాతిపదికన ప్రకటించారో తెలియదు, ఇప్పటివరకు పంట నష్ట అంచనా (క్రాప్ ఎన్యూమరేషన్) కూడా - మిగతా 2 లో..



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట కాంగ్రెస్ మెరుపు ధర్నా

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, మంత్రి పొన్నం సహా పలువురు నేతల అరెస్ట్
- ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు
- ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఢిల్లీకి వెళ్తాం: మహేశ్‌కుమార్ గౌడ్

ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ మెగా ర్యాలీకి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించలేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. రైల్వే స్టేషన్‌లోని జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయం ఎదుట బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, శ్రీగణేశ్ సహా పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ చేసిన తొలి ట్రాన్స్‌మహిళకు సజ్జనార్ సత్కారం



ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చు. ఈ విషయాన్ని తెలంగాణాకుచెందిన డా. కొయ్యల రూత్ మరోసారి నిరూపించారు. వ్యవసాయ కూలీగా పనిచేస్తూ ఎన్నో కష్టాలు, వివక్షను ఎదుర్కొన్నప్పటికీ ఇపుడు డాక్టర్ కొయ్యల రూత్ జాన్ పాల్ నిరూపించారు. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ పూర్తిచేసి, దేశంలోనే ఈ ఘనత సాధించిన ట్రాన్స్‌జెండర్‌గా నిలిచిన రూత్‌జాన్ పాల్ ను హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. ఆమె ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం అంటూ ఆమెను సత్కరించిన ఫోటోలను ట్విటర్‌లో షేర్ చేశారు. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ పూర్తిచేసి, దేశంలోనే ఈ ఘనత సాధించిన మొట్టమొదటి ట్రాన్స్ మహిళగా నిలిచిన డాక్టర్ కొయ్యల రూత్ జాన్ పాల్ గారి సంకల్పాన్ని అభినందిస్తూ, వారిని సత్కరించాను. ఒకప్పుడు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ ఎన్నో కష్టాలు, వివక్షను ఎదుర్కొన్నప్పటికీ... పట్టుదలతో చదువుకుని, న్యాయపోరాటం చేసి పీజీ పూర్తిచేసిన ఆమె జీవన ప్రయాణం ప్రశంసనీయం. ప్రస్తుతం సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి అత్యవసర విభాగంలో సేవలందిస్తూ ఎందరో రోగుల ప్రాణాలు కాపాడుతున్నారు.

తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

నిరుపేద కుటుంబానికి జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం

దాతల సహకారంతో ఆ కుటుంబానికి అండ....



మంగపేట. ములుగు జిల్లా అక్టోబర్ 28- (సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండల కమలాపురం గ్రమంమాలవాడ కు చెందిన జెట్టి సుమిత్ర అనారోగ్యం తో మంగళవారం రోజు మరణించారు. వీరిది చాలా బీద కుటుంబం కావడంతో దహణసంస్కారాలు చేయడానికి కూడా డబ్బులు లేనటువంటి పరిస్థితి వీరి కుటింబికులు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ వారి సహాయం కోరడం తో జ్వాలా ట్రస్ట్ వారు ఈ విషయాన్ని సోషల్ మీడియా వాట్సాప్ ధ్వారా దాతలసహకారం కోరడం జరిగింది కొంతమంది దాతలు వారికి తోచినంత సహాయం చేయగా మొత్తం 14000 రూపాయలు జ్వాలా ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ ఆదేశాల మేరకు ట్రస్టు సభ్యులు వీరి కుటుంబానికి ఇవ్వడం జరిగింది ఈ కారిక్రమంలో గోలి నరేష్,గంగుల చంటి,నిమ్మల నరేష్,మావిల్ల నాగరాజు ,కర్రి లక్ష్మయ్య, తోగరి సురేష్,తోగరి ఆనంద్,తోగరి అరుణ్ ,సాధనపల్లి సాంబయ్య, జెట్టి రవి,గద్దల ప్రశాంత్ పాల్గొన్నారు..

వర్షంలోనూ కొనసాగుతున్న ఉద్యోగుల సమ్మె..



ములుగు. అక్టోబర్ 28 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు లోనే మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల నిరసన సమ్మె 16వ రోజుకు చేరింది. బుధవారం వర్షం కురుస్తున్నప్పటికీ సమ్మె దీక్ష కొనసాగించారు. ప్రభుత్వం తమడిమండ్ల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరహరి. నవీన్. తరుణ్. శ్రీనివాస్. పార్వతి. లోకప్రియ. చందన. అనిత. భవ్య. సిద్ధ. రజిని. దివ్య. సైకాలజిస్ట్ కిరణ్ కుమార్. ఫార్మసీ ఆఫీసర్స్ . నవీన్. సతీష్ పాల్గొన్నారు..

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం..

బాడిశ నాగ రమేష్





మంగపేట, ములుగు జిల్లా అక్టోబర్ 28 (సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఆగబోయిన వెంకన్న,జారా సైదులు మరణించారు. వారి ఇంటికి ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేష్ వెళ్లి వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి స్థానిక బీఆర్ఎస్ నాయకులు సమకూర్చిన 4000 రూపాయల చొప్పున రెండు కుటుంబాలకు అందజేశారు.అలాగే పక్కనే ఉన్న కొత్తూరు మోట్లగూడెం గ్రామానికి చెందిన బీ ఆర్ఎస్ కార్యకర్త మంకిడి చంద్రయ్య ఇటీవల చేను కావలా కాస్తూ మంచె మీద నుంచి పడి చేతికి, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను కలిసి వైద్య ఖర్చుల కోసం 4000 రూపాయల సహాయం అందించారు.ఈ సందర్భంగా బాడిశ నాగ రమేష్ మాట్లాడుతూ..బీ ఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని చెప్పారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకులు కొమరం ధనలక్ష్మి, సీనియర్ నాయకులు మార్పుల వెంకటరెడ్డి, కోమటిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీను, జువ్వాజి ముసలయ్య, మండల నాయకులు సత్తర్ షఫీ, లోడే కృష్ణ, లోడే రమేష్, బూరుగుల ఉప్పలయ్య, గుడిశాల సమీదాసు, కొమరం నాగేష్, పోడెం నారాయణ, పగిడిపాల సంధిబ్, వివిధ గ్రామాల అధ్యక్షులు మునిగేలా సాంబుల్, కొమరం పుల్లారావు, రూప భద్రయ్య, నాయకులు మండల సంతోష్, మునిగేలా మహేష్, ఇందారపు రమేష్, సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు.

షాపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎంపిక..

- **అధ్యక్ష పదవికి ఇద్దరి పోటీ!**
- **అధిష్టానం నిర్ణయమే కీలకం.. త్వరలో షాపల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడి ప్రకటన!**
- **అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం.. స్పష్టం చేసిన గ్రామస్తులు**
- **మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాలతో గ్రామ కమిటీ ఎంపిక ప్రక్రియ!**
- **కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకుల పిలుపు!**

ఏటూరునాగారం, అక్టోబర్ 28:(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో షాపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కమిటీ ఎంపిక ప్రక్రియ చేపట్టారు.– ఈ సందర్భంగా షాపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఇద్దరు వ్యక్తులు పోటీకి ముందుకు రావడంతో, వారి పేర్లను పార్టీ అధిష్టానానికి పంపించడం జరిగింది. అధిష్టానం పరిశీలించి తీసుకునే



నిర్ణయం మేరకు గ్రామ అధ్యక్షుడి పేరును త్వరలో ప్రకటించనున్నట్లు నాయకులు తెలిపారు...గ్రామ కమిటీ ఎంపిక సందర్భంగా గ్రామస్తులు తమ అభిప్రాయాన్ని స్పష్టం చేస్తూ, అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న ఇద్దరిలో అధిష్టానం ఎవరి పేరును ప్రకటించినా తామంతా ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. పార్టీ ఐక్యతకు ప్రాధాన్యత ఇస్తూ, అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించి ప్రకటించిన అధ్యక్షుడికి సహకరిస్తామని పేర్కొన్నారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులంతా ఐక్యంగా పనిచేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ కొండగొర్ల పోషయ్య, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు వావిలాల ఎల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి సరికొప్పుల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్లు చేల వినయ్, డొంగిరి మధుబాబు, మండల ఎస్సీ అధ్యక్షులు కర్నే సత్యం, రామన్న గూడెం సర్పంచ్ గద్దల నవీన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా కృష్ణా రెడ్డి(ఠాగూర్) తదితరులు హాజరయ్యారు..ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో షాపల్లి గ్రామ సర్పంచ్ రాందేని రాజు, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు కుక్కల రామయ్య, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు..

మన ఇంటికి మన బాత్రూం పరిశుభ్రతపై అవగాహన

- **మరుగుదొడ్డి ఆరోగ్యకరమైన కుటుంబానికి తొలి అడుగు..**
- **కాఫీడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, సదస్సు**

వాజేడు. ములుగు జిల్లా అక్టోబర్ 28 (సూర్యోదయ వార్త)

– ములుగు జిల్లా, వాజేడు మండలంలోని బొమ్మనపల్లి, గ్రామంలో బుధవారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో “మన ఇంటికి – మన బాత్రూమ్” అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, రహీం, మాట్లాడుతూ, “ప్రతి ఇంటికి మరుగుదొడ్డి – ఆరోగ్యకరమైన కుటుంబానికి తొలి అడుగు” అని పిలుపునిచ్చారు. మన ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం ప్రతి కుటుంబ సభ్యుడి బాధ్యత అని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయ



కుండా, ప్రతి ఇంటిలో సురక్షితమైన మరుగుదొడ్డిని నిర్మించుకొని, దానిని క్రమం తప్పకుండా ఉపయోగించడం ద్వారా మన గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా మార్చుకోవచ్చని తెలిపారు. మరుగుదొడ్డి వినియోగం వల్ల వ్యాధుల వ్యాప్తిని తగ్గించడంతో పాటు, మహిళలు, పిల్లలు



మరియు వృద్ధుల భద్రత, ఆత్మగౌరవాన్ని కాపాడవచ్చని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమానికి ఉప సర్పంచ్, వాజేడు మండల కోఆర్డినేటర్ గొంది కామేశ్వరరావు, భాస్కర్, రమాదేవి, దీప, ప్రసాదు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది,.

వాజేడు మండల కేంద్రంలో పిఆర్‌టియు తెలంగాణ కార్యవర్గ సమావేశం

ములుగు ప్రతినిధి అక్టోబర్ 28 సూర్యోదయ వార్త.:

– వాజేడు మండల అధ్యక్షులు కరుటూరి సతీష్ కుమార్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేయడం జరిగింది, సమావేశానికి ముఖ్య అతిథులుగా ములుగు జిల్లా పిఆర్టియు తెలంగాణ అధ్యక్షులు కొయ్యడ సురేందర్ ప్రధాన కార్యదర్శి పోరిక రామన్న నాయక్ పాల్గొనడం జరిగింది,జిల్లా అధ్యక్షులు ఈ సందర్భంగా మాట్లాడుతూ,,రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పి ఆర్ సి అమలు చేయాలని సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఈ హెచ్ ఎస్ ద్వారా సక్రమమైన వైద్యం అందించేటట్లు అమలు చేయాలనిడి ఎస్ సి 2024 ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లరేషన్ సర్వీస్ క్రమబద్ధీకరణ త్వరితగతిన జరిగే విధంగా డి డి వో లు చర్యలు చేపట్టాలని కోరడం జరిగింది,



సమావేశంలో వాంకుడోత్ భావు సింగ్ ని పి ఆర్ టి యు తెలంగాణ ములుగు జిల్లా ఉపాధ్యక్షుడిగా వాజేడు మండల పిఆర్టయు తెలంగాణ మహిళా అధ్యక్షురాలిగా కే గీతాంజలి ని ఎన్నుకోవడం జరిగింది, వారికి శు భాకాంక్షలు తెలియజేసి మండలంలోని ఉపాధ్యాయులు అందర్నీ ఐక్యం చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం



కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించడం జరిగింది,కార్యక్రమంలో పిఆర్‌టియు తెలంగాణ జిల్లా అధ్యక్షులు కొయ్యాడ సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరిక రామన్న నాయక్, వాజేడు మండల అధ్యక్షులు కరుటూరి సతీష్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఈ,రాజు, నూనావత్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు..

కొమరం భీమ్ 86 వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు

వెంకటాపురం. నూగూరు. అక్టోబర్ 28 (సూర్యోదయ వార్త.)

– ములుగు జిల్లా వెంకటాపురం మండలం, అలుబాక గ్రామపంచాయతీ పరిధిలోని ముత్తారం గ్రామంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు ఆధ్వర్యంలో మన్యం వీరుడు, ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కొమరం భీమ్ 86.వవర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన త్యాగాలను స్మరించుకున్నారు.కొమరం భీమ్ తన జీవితాన్ని ఆదివాసీల హక్కుల పరిరక్షణకు అంకితం చేశారని, అణగారిన గిరిజన ప్రజలపై జరుగుతున్న అన్యాయాలు, దోపిడీ, అక్రమ ఆక్రమణలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని వక్తలు పేర్కొన్నారు. ఆయన పోరాటం కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిచ్చిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముత్తారం గ్రామ పెద్దలు కుంజ సూరిబాబు, సోడి గోపి, సంద సూరిబాబు మీడియం వెంకటేశ్వర్లు కుంజ సమ్మయ్య ముత్తారం టీడబ్ల్యూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పర్సిక రమేష్ పాల్గొని కొమరం భీమ్ చిత్రపటానికి నివాళు లర్పించారు. గ్రామస్థులు, యువత, మహిళలు కూడా కార్యక్రమంలో పాల్గొని కొమరం భీమ్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా కొమరం భీమ్ ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన



చూపిన పోరాట స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, జల్--జంగిల్--జమీన్ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఆదివాసీ భూములు, అటవీ సంపద, సహజ వనరులపై స్థానిక ప్రజల హక్కులను కాపాడేందుకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, పంచాయతీ రాజ్ చట్టాలు, అటవీ హక్కుల చట్టం 1/70 చట్టం వంటి చట్టాలపై ఆదివాసీ ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఆదివాసీ సమాజం ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని, విద్య, వైద్యం, ఉపాధి, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కోసం సమిష్టిగా కృషి చేయాలని కోరారు. యువత కొమరం భీమ్ జీవిత చరిత్రను, ఆయన త్యాగాలను అధ్యయనం చేసి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కొమరం భీమ్ ఆశయాలను ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరవేసి ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, భాషను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.కొమరం భీమ్ చూపిన మార్గం ఆదివాసీ సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని, ఆయన త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేయడమే నిజమైన నివాళి అని గుర్తు చేసుకున్నారు.... కార్యక్రమంలో ముత్తారం గ్రామస్తులు కుంజ సంతోష్ మీడియం అర్జున్ కుంజ రమణ తాటి సరోజిని సోడి జయ పాల్గొన్నారు....

తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ టీమ్

- సీతంపేట బంజారా గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ పరిశీలన
- ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా. సర్పంచ్ జానకి రామ్





సుజాతనగర్ సూర్యోదయ వార్త అక్టోబర్ 28 :

సీతంపేట బంజారా గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ బృందం సుజాతనగర్ మండలంలో పర్యటించింది. మండలంలోని సీతంపేట బంజారా గ్రామ పంచాయతీని సెంట్రల్ టీమ్ సభ్యులు బుధవారం సందర్శించి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలో నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ, ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, తడి-పొడి చెత్త సేకరణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన మొక్కలు, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, డంపింగ్ యార్డును సందర్శించారు. గ్రామం క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండటం పట్ల సెంట్రల్ టీమ్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. గ్రామస్తులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి డీపీవో అనూష, సుజాతనగర్ ఎంపీడీఓ భారతి, డి ఎల్ పి ఓ ప్రభాకర్, ఎంపీవో గాంధీ, సీతంపేట బంజారా గ్రామ సర్పంచ్ జానకి రామ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమని అధికారులు తెలిపారు. ఇదే స్ఫూర్తితో గ్రామాన్ని మరింత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ జానకి రామ్ ను అధికారులు కోరారు.

నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..



సూర్యోదయ వార్త ప్రతినిధి,మంగపేట, అక్టోబర్ 28

ములుగు జిల్లా మంగపేట మండలం రమణక్కపేట గ్రామపంచాయతీలో బుధవారం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.గ్రామ పరిపాలన అధికారి కన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఏసుపాదం, పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ రావుల లలిత, పంచాయతీ సిబ్బంది గాజ నరసింహ రావు, లబ్ధిదారులు పాల్గొన్నారు..

కొండాయి చేరుకున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు..

కొండాయి గ్రామ ప్రజలకు తుఫాను ప్రమాదాలపై అవగాహన కల్పించిన బృందం.



ఏటూరు నాగారం. ములుగు జిల్లా అక్టోబర్ 28 - (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామంలో బుధవారం ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం గ్రామ ప్రజలకు తుఫాన్ ప్రమాదాలపై అవగాహన కల్పించింది. భారీ తుఫాన్. ఈదురు గాలులు. వర్షాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించింది. ప్రస్తుత తుఫాన్ నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు పాటించాలని. ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని ప్రజలకు వివరించారు..

ములుగు జిల్లాలో 44.2 మి. మీ వర్షపాతం నమోదు..

ములుగు. అక్టోబర్ 28 (సూర్యోదయ వార్త. ప్రతినిధి)



అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ములుగు జిల్లా వ్యాప్తంగా వర్షపు జల్లుల కురుస్తున్నాయి . ఇప్పటివరకు 44.2 మి. మి వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వెంకటాపురంలో అత్యధికంగా 10.4 మి. మీ. మంగపేటలో 9.2. తాడ్వాయిలో 6.4. ఏటూరు నాగారంలో 4.2' వాజేడు లో 3.8' గోవిందరావుపేటలో 3.2' కన్నాయిగూడెంలో 2.6' ములుగులో 2.2' వెంకటాపూర్ లో 1.2' మల్లంపల్లిలో 1.0 మి. మీ వర్షం కురిసింది. జిల్లా సగటు 4.4. మి మీ. నమోదయింది ...

ఇసుక లారీలతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు..

- ప్రధాన రహదారిపై అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి .
- ఈ రహదారి ఇసుక లారీలకు అడ్డానా అని ప్రశ్నిస్తున్న ప్రయాణికులు..
- పాలాయగూడెం వద్ద గంటల తరబడి నిలిచిన వాహనాలు - అధికారులు ఎక్కడ?

మంగపేట, ములుగు జిల్లా అక్టోబర్ 28 (సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలం వాడగూడెం గ్రామ పంచాయతీ పాలాయగూడెం పరిధిలో ఏటూరు నాగారం– బూర్గంపాడు రహదారిలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. తెలుగు రాష్ట్రాల్లో భారీ తుఫాను, భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరోపక్క ములుగు జిల్లాలో అత్యధికంగా ప్రధాన రహదారిపై ఇసుక లారీల గోల మాత్రమే కనిపిస్తున్నాయి. తాజాగా



బుధవారం మంగపేట మండల కేంద్రంలోని పాలాయి గూడెం . ఓడగూడెం మధ్య రెండు మూడు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయినా ఏ అధికారి కూడా రాలేదు , ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.. అత్య వసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అత్యవసరమైతే ట్రాఫిక్ వలన అంబులెన్స్ లో ఉన్న రోగులు ప్రాణాలు గాల్లో కలిసి అవకాశం ఉంది . అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగం,



జిల్లా యంత్రాంగం ప్రజలకు సూచనలు చేయాల్సిన సమయంలో పట్టించుకోకపోవడం లేదని ప్రయాణికులు తీవ్రంగా మండిపడ్డారు . ప్రభుత్వానికి ఇసుక మీద, ఆదాయం మీద ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాల మీద లేదని విమర్శించారు.ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇసుక లారీలను వాటికి నిర్దేశించిన ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసి రహదారిపై ప్రయాణికుల ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు. వాహనదారులు డిమాండ్ చేశారు

నిరుపేద కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ అండ..

- రూ.33,500 చెక్కు అందజేత!
- మంత్రి సీతక్క ఆదేశాలతో బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా..
- చెక్కు అందించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బుట్టాయిగూడెం సర్పంచ్ జాడి రాంబాబు!..
- ప్రజా సంక్షేమమే లక్ష్యం.. నిరుపేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ నాయకులు!

-కన్నాయిగూడెం, ములుగు జిల్లా అక్టోబర్ 28:(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బుట్టాయిగూడెం సర్పంచ్ జాడి రాంబాబు అన్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో



కన్నాయిగూడెం మండలం గుర్రేవుల గ్రామ పంచాయతీకి చెందిన మఠం బన్నీ, తండ్రి వెంకటేశ్వర్లు గారికి రూ.33,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా జాడి రాంబాబు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే సహాయ నిధులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి సీతక్క నాయకత్వంలో, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు మండలంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని నాయకులు తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంతనపల్లి సర్పంచ్ చింత చంద్రయ్య, సర్వాయి సర్పంచ్ కోరం నర్సయ్య (రాజు), గుర్రేవుల సర్పంచ్ అంబాల సౌజన్య, చింతగూడెం సర్పంచ్ అల్లే అనిత, ముప్పనపల్లి సర్పంచ్ తిప్పనపల్లి లక్ష్మయ్య, ఐలాపూర్ సర్పంచ్ పీర్ల సురేష్, రాజన్నపేట సర్పంచ్ పొడెం నర్సింగరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ మాదాసు రాజేందర్, మాజీ ఎంపీటీసీ ఆలం రాంబాబు, మండల నాయకులు పూజరి సత్యనారాయణ, మండల యువజన విభాగం ఉపాధ్యక్షుడు కుమ్మరి వెంకట్, బుట్టాయిగూడెం యువజన అధ్యక్షుడు జనగాం వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్‌పై మంత్రి సీతక్క హై అలర్ట్..

- ములుగు జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు!.
- ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యం..
- క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి.
- ఈదురుగాలుల ముప్పు నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..
- మంత్రి సీతక్క ఆదేశం..

ములుగు, అక్టోబర్ 28: (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ములుగు జిల్లా యంత్రాంగాన్ని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క అప్రమత్తం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈదురుగాలుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సీతక్క



ఆదేశించారు..

ఉప్పాడ తీరంలో 30 ఇళ్లు నేలమట్టం.. కొట్టుకుపోయిన రోడ్డు

ఉత్తరాంధ్ర జిల్లాల్లో కుండపోత వర్షాలు..

విశాఖలో అత్యధికం

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' అతి తీవ్ర తుఫాను బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. సుమారు ఆరు గంటలకు పైగా కొనసాగిన తీరం దాటే ప్రక్రియతో కోస్తాంధ్ర అతలాకుతలమైంది. విధ్వంసకర గాలులు, కుండపోత వర్షాలతో జనజీవనం స్తంభించింది. తీరం దాటిన తర్వాత తుఫాను బలహీనపడినప్పటికీ, దాని ప్రభావంతో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ తుఫాను యానాం సమీపంలో తీరాన్ని దాటింది. ఆ సమయంలో గంటకు 125-135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, గరిష్ఠంగా గాలి వేగం 150 కిలోమీటర్ల వరకు నమోదైందని తెలిపారు. తీరం దాటిన అనంతరం ఉదయం 8:30 గంటలకు ఇది అతి తీవ్ర తుఫాను నుంచి తీవ్ర తుఫానుగా బలహీనపడింది. ఉదయం 9:50 గంటల సమయానికి తీరం దాటే ప్రక్రియ పూర్తిగా ముగిసిందని, తుఫాను కేంద్రం నర్సాపురానికి 20 కి.మీ తూర్పున, యానాంకు 40 కి.మీ నైరుతిన కేంద్రీకృతమై ఉందని ఎఓఆ తన బులెటిన్‌లో పేర్కొంది.తుఫాను ప్రభావంతో కోస్తాంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం 8:30 గంటల సమయానికి అత్యధికంగా విశాఖపట్నంలో 315 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, విజయనగరంలో 301 మి.మీ, అనకాపల్లిలో 275 మి.మీ, శ్రీకాకుళంలో 257 మి.మీ, కృష్ణా జిల్లాలో 223 మి.మీ వర్షం కురిసింది. పొరుగు రాష్ట్రమైన ఒడిశాలోని కోరాపుట్‌లో 188 మి.మీ, గంజాంలో 161 మి.మీ వర్షపాతం నమోదైంది.అధికారులు ముందుజాగ్రత్త చర్యగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో తీరప్రాంతాల నుంచి 1.80 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బలమైన గాలుల కారణంగా అనేక ప్రాంతాల్లో చెట్లు కూలిపోయి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, రైళ్లు, విమాన సర్వీసులపై ప్రభావం పడింది. విశాఖపట్నం, విజయవాడకు పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఇప్పటివరకు రెండు రాష్ట్రాల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. అర్నబ్ తుపాను సృష్టించిన బీభత్సంతో కాకినాడ జిల్లాలోని ఉప్పాడ తీర ప్రాంతం అతలాకుతలమైంది. ఈ తెల్లవారుజామున విరుచుకుపడిన రాకాసి అలల ధాటికి ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు కొట్టుకుపోగా, సుమారు 30 ఇళ్లు నేలమట్టమయ్యాయి. సముద్రం అల్లకల్లోలంగా మారి అలలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో తీరప్రాంత గ్రామాలు వణికిపోయాయి. తుపాను ప్రభావంతో సుబ్బంపేట, ఉప్పాడ, సూరడపేట, జగ్గరాజుపేట, పల్లిపేట, రంగంపేట, మాయాపట్నం వంటి గ్రామాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకొచ్చింది. అలల ఉద్ధృతికి దాదాపు 30 ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. బలమైన గాలులకు మరికొన్ని ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోయాయి. సుబ్బంపేట వద్ద తీరప్రాంతాన్ని కాపాడేందుకు నిర్మించిన రక్షణ గోడ సైతం పూర్తిగా ధ్వంసమైంది. రక్షణ కోసం ఏర్పాటు చేసిన భారీ బండరాళ్లు కూడా అలల తాకిడికి చెల్లాచెదురయ్యాయి. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు అనేక చోట్ల కోతకు గురైంది. ముఖ్యంగా సుబ్బంపేట వద్ద రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో అధికారులు బీచ్ రోడ్డుపై వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. దెబ్బతిన్న ఇళ్లు, రహదారులను పరిశీలిస్తున్నారు. సముద్రం ఇంకా అల్లకల్లోలంగా ఉన్నందున ప్రజలు తీరప్రాంతాలకు వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. నష్టాన్ని పూర్తిగా అంచనా వేసిన తర్వాతే బీచ్ రోడ్డుపై ట్రాఫిక్‌ను పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్నాబ్ అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. మంత్రులు నారాయణ, ఆనగాని సత్యప్రసాద్ వేర్వేరుగా అధికారులతో సమీక్షలు నిర్వ హించి, జనజీవనానికి ఆటంకాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ, తుపాను ప్రభావిత ప్రాంతాల మున్సిపల్ కమిష నర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రహదారులపై కూలిన చెట్లను యంత్రాల సహాయంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు. బలమైన గాలులకు ప్రమాదకరంగా మారే హోర్డింగుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై, డ్రెయిన్లలో నీరు నిలిచిపోకుండా ఇంజినీరింగ్ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



రష్మిక పాత్ర కోసం వెళ్లి సీతగా.. ‘సీతారామం’ చిత్రంలో మృణాల్ ఠాకూర్ ఎంపిక వెనుక అసలు కథ ఇదే.!

యువ నటి మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో టాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ‘సీతారామం’ ఎంతటి మైలురాయిగా నిలిచిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే ఈ చిత్రంలో ఆమెను మొదట ‘అఫ్రీన్’ పాత్ర కోసమే సంప్రదించారట. కానీ కథ చెప్పే క్రమంలో దర్శకుడు హను రాఘవపూడి ఆమెను చూసి మనసు మార్చుకుని, ఏకంగా ‘సీత మహాలక్ష్మి’ ప్రధాన పాత్రకు ఎంపిక చేయడం విశేషం. దర్శకుడు హను రాఘవపూడి దాదాపు ఐదు గంటల పాటు ఎంతో ఓపికగా, భావోద్వేగాలతో ఈ కథను తనకు వినిపించారని, ఆ నెరేషన్ తనను ఎంతగానో కదిలించిందని మృణాల్ పలు సందర్భాల్లో గుర్తుచేసుకున్నారు. నాగ్ అశ్విన్ ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ బ్యూటీ, సీత పాత్రలో ఒదిగిపోయి తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆ పాత్రలోని స్వచ్ఛత, అంకితభావం ఈ సినిమాను టాలీవుడ్‌లో ఒక కల్ట్ క్లాసిక్‌గా నిలబెట్టాయి.

నాకు భర్త అవ్వాలంటే.. ఇవి ఉండాలి

తెలుగు సినీ పరిశ్రమలో వరుస సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది యువ కథానాయిక రితికా నాయక్. ‘అశోకవనంలో అర్జున కల్యాణం’, ‘మిరాయ్’ చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ బ్యూటీ.. నేడు పుట్టినరోజు నిర్వహించుకుంటోంది. ఈ సందర్భంగా ఆమెకు సంబంధించిన ఆసక్తికర విషయాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. గతంలో ఓ ఇంటర్వ్యూలో తనకు నచ్చిన హీరో ఎవరో చెప్పిన రితికా.. తనను పెళ్లి చేసుకునే వ్యక్తిలో ఎలాంటి లక్షణాలు ఉండాలో కూడా వెల్లడించింది. ఇప్పుడీ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

సినిమా రంగంలో కథానాయికగా గుర్తింపు తెచ్చుకోవాలంటే అందం ఒక్కటే సరిపోదు. నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలి. ఇదే ఆలోచనతో ముందుకు సాగుతోంది రితికా నాయక్. తనకు అందమైన రూపం ఉందని మాత్రమే కాకుండా.. ‘బాగా నటిస్తుంది’ అని ప్రేక్షకులు అనుకోవాలన్నదే తన లక్ష్యమని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. అన్ని రకాల పాత్రల్లో నటించాలని ఉందని, ఒక్క తరహా పాత్రలకే పరిమితం కావడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేసింది.

మీ క్రష్ ఎవరని రితికాను ఓ సందర్భంలో అడగ్గా.. తనకు అల్లు అర్జున్‌పై క్రష్ ఉందని రితికా నాయక్ చెప్పుకొచ్చింది. అదే సందర్భంలో జీవిత భాగస్వామి విషయంలోనూ ఆమెకు కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలు ఉన్నాయని తెలిపింది. తనను ఎంతో ప్రేమించే వ్యక్తి కావాలని, బంధంలో నమ్మకానికి ప్రాధాన్యమివ్వాలని తెలిపింది. అంతేకాదు.. తన వృత్తిని అర్థం చేసుకుంటూ, కెరీర్‌లో ముందుకు సాగేందుకు ప్రోత్సహించే వ్యక్తి తనకు భర్తగా రావాలని కోరుకుంటున్నట్లు పేర్కొంది. కాగా ఇటీవల కొరియన్ కనకరాజుతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన రితికా.. వరుస అవకాశాలతో బిజీగా ఉంది. ప్రస్తుతం వరుణ్‌తేజ్‌తో కలిసి ‘డ్యూయెట్’ అనే సినిమాలో నటిస్తోంది.





అయ్యప్పపై ‘మాలికాపూరం’ దర్శకుడి కొత్త చిత్రం.. ‘మణికంఠ’ ఫస్ట్ లుక్ విడుదల

మలయాళంలో సంచలన విజయం సాధించిన బ్లాక్‌బస్టర్ చిత్రం ‘మాలికాపూరం’ దర్శకుడు విష్ణు శశి శంకర్ నుంచి మరో ఆధ్యాత్మిక చిత్రం రాబోతోంది. తంత్రా ఫిలిమ్స్ పతాకంపై తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘మణికంఠ’ అయ్యప్ప స్వామి నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. ‘(అయ్యప్ప దర్శనానికి సిద్ధం కండి) అంటూ సాగిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో వైభవ్ టైటిల్ రోల్‌లో నటించబోతుండగా, మీనాక్షి గోవిందరాజన్ అరవింద్ ఆకాష్ జె.కె. శరవణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్ గి అమరన్ సంగీతం అందిస్తుండగా, సూర్య రాజీవన్, శతశ్ కుమార్ తదితరులు ఇతర సాంకేతిక విభాగాల్లో పని చేస్తున్నారు. అయ్యప్ప భక్తులను, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకునేలా రూపొందుతున్న ఈ ‘మణికంఠ’ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలువడనున్నాయి.

ఇటు సీత.. అటు ఐపీఎస్ ఆఫీసర్

సాయిపల్లవి.. ఈ పేరు రాబోయే నెలరోజుల్లో కాస్త గట్టిగానే వినిపించనుంది. ఎందుకంటే చాన్నాళ్లుగా దక్షిణాది సినిమాల్లో కనిపించని ఈ బ్యూటీ.. కేవలం 15 రోజుల వ్యవధిలో రెండు క్రేజ్ ఉన్న మూవీస్‌తో రాబోతుంది. ఆయా పాత్రలు, సదరు చిత్రాల్లో సాయిపల్లవే మెయిన్ హైలైట్‌గా కానుందని అనిపిస్తోంది. మొదటగా ‘రామాయణ’ విషయానికొస్తే ఇందులో ఈమె సీత పాత్ర పోషించింది. వచ్చే శుక్రవారం అంటే నవంబర్ 05న పాన్ ఇండియా రేంజులో ఈ మూవీ రిలీజ్ కానుంది. టీజర్ వచ్చినప్పుడు సీత పాత్ర, ఆహార్యాన్ని సందేహిస్తూ కొందరు ట్రోల్స్ చేశారు. ట్రైలర్, సాంగ్స్ వచ్చిన తర్వాత ఇవి కాస్త తగ్గినట్లే కనిపించాయి. ప్రమోషనల్ కంటెంట్‌పై ఎన్ని విమర్శలైనా రావొచ్చు కానీ మూవీ వచ్చిన తర్వాత అందులో సీత పాత్ర ఆకట్టుకుంటే మాత్రం ఇవన్నీ పక్కకువెళ్లిపోతాయి. ‘ఓం’ విషయానికొస్తే.. ధనుష్ హీరోగా చేసిన తమిళ సినిమా ఇది. ఇందులో ఐపీఎస్ నిత్యారెడ్డి అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా సాయిపల్లవి నటించింది. ఈమె పాత్రకు సంబంధించిన గ్లింప్స్ అయితే అదిరిపోయింది. ధనుష్, మమ్ముట్టి పాత్రలతో పాటు ఈమెది ఎక్కువగా హైలైట్ అయ్యేలా ఉందనిపిస్తోంది. ఈ మూవీ నవంబర్ 20న తెలుగు, తమిళంలో రిలీజ్ కానుంది. గతేడాది ఫిబ్రవరిలో ‘తండేల్’ మూవీతో థియేటర్లలోకి వచ్చిన సాయిపల్లవి.. అద్భుతమైన సక్సెస్ అందుకుంది. మళ్లీ ఈ ఏడాది మే నెలలో ‘ఏక్ దిన్’ అని హిందీలోకి ఎంట్రీ ఇచ్చింది కానీ ఇది ఘోరంగా డిజాస్టర్ అయింది. దీంతో ఆశలన్నీ ‘రామాయణ’ మీదే పెట్టుకుంది. ఒకవేళ ఈ రెండు సినిమాలు హిట్ అయి, సాయిపల్లవి పాత్రలకు పేరొస్తే ఈ నవంబర్ ఈమెకు స్పెషల్ అవుతుంది. లేదంటే కష్టమే!

